క్లుప్తంగా

ఏసుబాబును అభినందించిన జాన్సన్



భీమవరంలోఏసుబాబును సత్కరించిన జాన్సన్

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్‌రాష్ట్ర చైర్మన్ మేడిది జాన్సన్‌ను ఆ పార్టీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు భలే యేసుబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జాన్సన్ నివాసంలో కలసిన యేసుబాబు మాట్లాడుతూ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ పటిష్టానికి కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా యేసుబాబును శాలువతో జాన్సన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుంటి ప్రభు, సాడ దాసి యాకోబు, నక్క అశోక్ బాబు, బడుగు బలరాజు, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానంపై హర్షం

వీరవాసరం: దేవస్థాన కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలనే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వై జగన్ మోహన్ రెడ్డికి ఎప్పుడు నాయి బ్రాహ్మణులు అంతా అండగా నిలుస్తామని మాజీ ఎంపీటీసీ సభ్యుడు మొగంటి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమేనని పేర్కొన్నారు. సీఎం జగన్ నిర్ణయంపై అందనాలపల్లి రామాంజనేయులు, కొట్టాపు శ్రీదేవి ,గనియాడ శ్రీనివాసరావు, గంద్రెటి నాని, మహేష్ , కొట్టాపు మోసే రతన్ కుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

ఉండి: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని పంపిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మత్తి రాజ్‌కుమార్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఎస్టీలు ఏ కులంలో ఉన్నా వారికి ఎస్టీ హోదా కల్పిస్తున్నారని అలాగే ఎస్సీలకు ఇవ్వాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. గతంలో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమీషన్ నివేదికలో పేర్కొన్నట్లు రాష్ట్ర దళిత క్రైస్తవుల పక్షంగా కేంద్రంతో విన్నవించాలని కోరుతున్నానన్నారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం 7వ రోజు ఉద్యోగులు భోజన విరామ సమయంలో తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రతి నెలా 1న జీతాలివ్వాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అలాగే నూతన పీఆర్‌సీ కమిటిని వెంటనే నియమించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు విద్యుత్ ఉప కేంద్రం నుంచి పెదగరువు విద్యుత్ ఉపకేంద్రానికి వెళ్లే 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించే నిమిత్తం గురువారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ బుధవారం తెలిపారు. తాడేరు, యమునాపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు, చినపేటలతో పాటు వీరవాసరం మండలంలోని దూసనపూడి, కమతాలపల్లి, బాలేపల్లి, మత్స్యపురిపాలెం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెగ్గిపూడి గురుకుల పాఠశాల తనిఖీ



నెగ్గిపూడిలో గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి

పెనుమంట్ర: మండలంలో నెగ్గిపూడి గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలను ఆగ్రామ ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి బోధన జరుగుతుందో? సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయో? తదితర అంశాలను ఉపాధ్యాయులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రధాన అంశాలతో పాటు వసతి సౌకర్యాలు కూడా మెరుగ్గా ఉన్నాయని విద్యార్థులు తెలియజేయడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



కొణితివాడ హైస్కూల్లో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు



గొరగనమూడిలో టీబీ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ శంకర్

వీరవాసరం: పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం కొణితివాడ హైస్కూల్‌ను సందర్శించి పిల్లలకు రక్తహీనత పరీక్షలు, ఐరన్ ట్యాబెట్ల పంపిణీ వంటి కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ వి.క్రాంతి కుమార్, డాక్టర్ లక్ష్మి అలేఖ్య, ఎంపీహెచ్‌ఈఓ హరి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

పాలకోడేరు: క్షయ వ్యాధిపై అవగాహన కలిగి, ఉన్నప్పుడే క్షయ వ్యాధిని త్వరితగతిన నయం చేసుకోవచ్చునని హెల్త్ సూపర్వైజర్ శంకర్, ఎంఎల్‌హెచ్‌పీ లలిత అన్నారు. గొరగనమూడి, విస్సాకోడేరు, పాలకోడేరు, పెన్నాడ గ్రామాల్లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల క్షయ వ్యాధిపై పాలకోడేరు పీహెచ్సీ వైద్యుడు డాక్టర్ రంగమ నాయుడు సూచనలతో ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వారం పైబడి ఎడతెరిపిలేని దగ్గు వస్తే వెంటనే ఆరోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా కఫం టెస్ట్ చేయించుకోవాలన్నారు. వ్యాధి మొదట ముందే ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత మందులను వాడడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెచ్‌వీ నాగమణి, ఏఎన్ఎం వేదకుమారి, భవాని, హేమ కుమారి, హెల్త్ అసిస్టెంట్లు ఎం.విజయ ప్రసాద్, గోపాలకృష్ణ, శ్రీను సుధాకర్, బురాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు .

ఫ్యామిలీ ఫిజీషియన్ సద్వినియోగం చేసుకోవాలి

పాలకోడేరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఉచితంగా మందులు తీసుకొని రోగాలను నయం చేసుకోవాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. మోగల్లు గ్రామంలో బుధవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 104 సిబ్బంది సహాయంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రంగం నాయుడు గ్రామంలో ఉన్న రోగులను, గర్భిణులను, బాలింతలను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. సీహెచ్‌ఓ సత్యనారాయణ, హెచ్‌వీ అమ్మాజీ, హెల్త్ అసిస్టెంట్ బురాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై సర్వే

భీమవరం అర్బన్: ఇటీవల పొరుగు రాష్ట్రాలలో హెచ్3ఎన్2 ఫ్లూ జ్వరాలు ప్రబలడంతో గ్రామాలలో బుధవారం ఫీవర్ సర్వే వేగవంతం చేశారు. గ్రామాలలో వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వరాలపై ఆరా తీస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తున్నారు. కుటుంబంలో ఎవరికైనా సీజనల్ జ్వరాలు వస్తే తప్పకుండా సమాచారం ఇవ్వాలని సర్వే సిబ్బంది కోరుతున్నారు.

20 మంది రుత్వికులతో హోమాలు



హోమ గుండం వద్ద అడిషనల్ ఎస్పీ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారి మందిరంలో నిర్వహిస్తున్న శ్రీవారి అష్టబంధన సంప్రోక్షణ మహోత్సవాల్లో సుమారు 4 గంటల పాటు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో 20 మంది రుత్వికులతో యాగ పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు మాట్లాడుతూ లోకశాంతి కోసం ఈ యాగం వేదోక్తంగా నిర్వహిస్తున్నామని, 17న శాంతి హోమం, 18న పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి తండ్రి కె.బుచ్చిబాబు, లయన్స్ క్లబ్ రాష్ట్ర నాయకులు లయన్ కృష్ణంరాజు హోమ కార్యక్రమంలో పాల్గొని ఇలాంటి యాగాలు ఇంతా ఘనంగా నిర్వహించడం భగవత్ సేవని అన్నారు. అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు-లక్ష్మిదేవి దంపతులు హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి తాడికొండ కోటేశ్వరరావుగుప్త, ఉపాధ్యక్షులు సరిపిడకల రామారావు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, జానపాటి మధుసూధనరావు, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దుంపగడపలో వినియోగదారుల హక్కుల దినోత్సవం



దుంపగడపలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.సుజాత.

ఆకివీడు: ప్రతి వ్యక్తీ వినియోగదారుడేనని, హక్కులు, బాధ్యతలతో నాణ్యమైన వస్తువుల్ని పొందేందుకు కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కనపర్తి సుజాత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మండలంలోని దుంపగడప వీవీ. గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సేవలు కూడా వినియోగదారుల హక్కుల్లోకే వస్తుయన్నారు. వస్తువు కొనుగోలుకు బిల్లు తీసుకున్నప్పుడే నాణ్యమైన వస్తువు లభిస్తుందన్నారు. ఆఫర్లు, రాయితీలు చూసి వినియోగదారులు మోసపోవద్దని ఆమె పిలుపునిచ్చారు. వినియోగదారుల హక్కుల చట్టం ఏవిధంగా ఉపయోగపడుతుందో ఆమె వివరించారు. కళాశాల వినియోగదారుల క్లబ్ విభాగం కోఆర్డినేటర్ టీ.ఓగేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల చట్టాలు రావడానికి కారణాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్



పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: నౌడూరు గ్రామంలో ఇంటి పన్ను బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గ్రామ కార్యదర్శి బి.వసంతవాణి ప్రసాద్ తెలిపారు. గ్రామంలో బుధవారం ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ ను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల పురోభివృద్ధికి ఇంటి పన్ను, కుళాయి పన్ను, గ్రంథాలయ పన్ను, ఇతర సెస్సులు ఎంతో ఉపకారం అవుతాయని వివరించారు. బకాయిలును త్వరితగతిన పూర్తి చేయడానికి సిబ్బందికి గ్రామస్తులంతా సహకరించాలని కోరారు. గ్రామంలో ఇప్పటి వరకు 60 శాతం మేర పను వసూలు చేశామని, దీనిని నూరు శాతం చేయడానికి పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లమిల్లి వేణుక, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆకివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా సమయానికి ముందుగానే ఆయా సెంటర్లకు విద్యార్థులు చేరుకున్నారు. జంబ్లింగ్ పద్ధతిలో విద్యార్థుల సీట్లు ఏర్పాటు చేశారు. మండలంలోని దుంపగడప, కార్తికేయ, విద్యా వికాస్ జూనియర్ కాలేజీల్లోని సెంటర్లలో మొత్తం 672 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 637 మంది హాజరయ్యారు. 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తెలుగు, ఉర్దూ, సంస్కృతం చదివే విద్యార్థులు మొదటి రోజు పరీక్షలను రాశారు.

ఉండిలో..

ఉండి: యండగండి జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైయ్యారు. యండగండి పరీక్షా కేంద్రంలో 201 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 196 మంది విద్యార్థులు హాజరయ్యారు.వీరిలో 161 మంది విద్యార్థులు సంస్కృతం, 20 మంది తెలుగు, 15 మంది ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు రాశారు.

దేవతామూర్తులకు జలాభిషేకం



వాలమర్రులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామివార్ల విగ్రహ ప్రతిష్టలో భాగంగా ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రులో భక్తుల విరాళంతో పెన్మెత్స సత్య సీతారామరాజు (మునసబు) జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామివార్ల ఆలయ, విగ్రహ, శిఖర ప్రతిష్టలో భాగంగా బుధవారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 12 మంది దంపతులతో బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో రుత్వికుల వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. హోమగుండంలో రావి, మోదిగ, దేవదారు సమిదలు, ఆవునెయ్యి తదితర హోమద్రవ్యాలతో భక్తులతో పూజలు చేయించారు. అనంతరం దేవతామూర్తులైన శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి, శ్రీలక్ష్మీదేవి విగ్రహాలు, శిఖరాలు జలాదివాసం చేశారు. హోమగుండం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు.

పంచాయతీ రికార్డులు తనిఖీ



వల్లూరు సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి అప్పారావు

పెనుగొండ: జిల్లా కలెక్టరు ఆదేశాలతో వల్లూరు పంచాయతీ రికార్డులు తనికీ చేయడం జరిగిందని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా జీఎస్ డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి కేసీహెచ్ అప్పారావు తెలిపారు. బుధవారం రికార్డుల తనికీ అనంతరం ఎంపీడీఓ వి.జగన్నాథరావుతో కలిసి వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి గ్రామ సచివాయాలను సందర్శించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ 250 తక్కువ కాకుండా సర్వీస్ రిక్వెస్టులను నమోదు చేయాలని, ఏపీ, మీసేవ పోర్టల్‌లో వచ్చిన అమౌంట్‌ను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ప్రతీ ఉద్యోగి డిపార్టెమెంట్ వారీగా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని, వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాలకు సబందించి గ్రామాల్లో వలంటీర్లు ద్వారా విస్తృతమైన ప్రచారాన్ని కల్పించాలన్నారు. జలుబు, దగ్గ తీవ్రమైన జ్వరాలు ఉన్నందున ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సచివాలయంలో స్పందన ప్రతిరోజూ 3 గంటల నుంచి 5 గంటల వరకూ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు జీవీవీ సత్యనారాయణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి



పెనుగొండలో ఏపీఎంకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుగొండ: డ్వాక్రా మహిళలకు సేవలు అందిస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి, వారికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పెనుగొండలో వెలుగు శాఖ ఏపీఎంకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘ అధ్యక్షురాలు జి లక్ష్మీ, కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: వెలుగుశాఖలో వీవోఏలుగా పనిచేస్తున్న మహిళలు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య భవనం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నరసాపురం మండలంలో 59 మంది వీఓఏలుగా పనిచేస్తున్నారని అన్నారు. ధీర్ఘకాలంగా పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు జి.పద్మకుమారి, డి.సూర్యమణి, కె.సత్యవతి పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాల తొలగింపు

సాక్షి కథనానికి స్పందన



రైల్వేస్టేషన్ రోడ్‌లో ప్రైవేట్ వాహనాలు తీయించిన దృశ్యం

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఇష్టానుసారం ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులపై ఈనెల 12న సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వాహనాలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. అలాగే అక్కడ ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్టు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. రైల్వే స్టేషన్ రోడ్‌లో ప్రైవేట్ బస్సులు, రొయ్యిల కంపెనీలకు సంబంధించిన ఇతర ప్రైవేట్ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బస్సులను కూడా ఈ ప్రాంతంలో కడగడంతో రోడ్డు పక్కన బురదమయంగా ఉంటుంది. ప్రస్తుతం అధికారుల చర్యల వల్ల సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుమంట్ర: గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెనుమంట్ర మండలంలోని నెగ్గిపూడి గ్రామానికి చెందిన మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ వాణి చింతపల్లి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 4లోపు తమ దరఖాస్తులను పంపించాలని కోరారు. విద్యార్థులను రాత పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని ఆమె తెలిపారు. ఈపాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత వసతి, బోధనతో పాటు క్రీడలు, బోధనేతర కార్యక్రమాల్లో కూడా శిక్షణ ఉంటుందని, పూర్తి వివరాల కోసం 87902 96772 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

పాలకొల్లు సెంట్రల్: మనిషి ఆపద సమయంలో ఉన్నప్పుడు రక్తదానం చేసి వారిని ఆదుకోవడం వల్ల ఒకరి ప్రాణంతో పాటు ఆ కుటుంబాన్ని కూడా కాపాడినవారవుతారని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అండ్ టు, రెడ్ రిబ్బన్ క్లబ్, హెల్త్ కేర్ సెంటర్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణీ సమయంలో, డెంగీ జ్వరాల వల్ల ప్లేట్‌లెట్స్ పడిపోవడం వంటి సమయాల్లో రక్తదానం ఎంతో ముఖ్యమని అన్నారు. విద్యార్థులు రక్తదానం చేయడంలో వెనుకడుగు వేయకుండా ఆపద సమయంలో ఆదుకునేలా ఉండాని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరింటెంట్ పి పతాంజలి, డాక్టర్ ఎం స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, గెస్ట్ ఫ్యాకల్టీ పి జ్యోత్స్న, వై విజయ్‌కుమార్, జి మహేష్, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం....

స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాలలో వినియోగదారుని హక్కుల దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీరవాసరం డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ యస్ వి రంగారావు మాట్లాడుతూ వినియోగదారులు ఏ వస్తువు కొన్నా తప్పనిసరిగా బిల్లు అడగాలని అన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు హక్కులపై పోస్టర్ ప్రదర్శన చేయగా ఈ ప్రదర్శనలో విజేతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, అధ్యాపకులు టి కృష్ణ, వి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అత్తను కొట్టిన అల్లుడిపై కేసు

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో అత్తను కొట్టిన అల్లుడుపై కేసు నమోదైంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీసలి గ్రామానికి చెందిన పిల్లి కుమారి తన రెండో కుమార్తెను అదే గ్రామానికి చెందిన గోడి జయరాజుతో పెళ్లి చేసింది. వీరి మధ్య కాపురం కొన్ని రోజులు బాగానే సాగింది. జయరాజు వేరొక అమ్మాయితో వివాహేతర సంబంధాన్ని పెట్టుకున్నాడు. అదే అంశాన్ని అల్లుడిని అత్త అడిగింది. జయరాజు అతని తల్లి సువార్త కలిసి అత్త కుమారిని కొట్టినట్లు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారని పోలీసులు తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

ఆకివీడు: స్థానిక పెదపేటకు చెందిన ఆటో డ్రైవర్ కురెళ్ల విక్టర్ బాబుపై ఆటో సీరియల్ పాటించలేదని చైతన్య, మౌళి అనే ఇద్దరు ఆటో డ్రైవర్లు దాడి చేసి గాయపరచిన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. సీరియల్ విధానాన్ని పాటించకుండా ప్రయాణికుల్ని ఆటోలో ఎక్కించుకుంటున్నందుకు గొడవ పడి సైకిల్ చైన్‌తో దాడి చేయగా కుడి కంటిపై గాయమైందని, ఆసుపత్రిలో ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

ఏలూరుపాడులో ఇనుపరాడ్డుతో దాడి

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో ఒక వ్యక్తి ఇద్దరు పై ఇనుపరాడుతో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. బుధవారం వారు అందించిన వివరాల ప్రకారం ఏలూరుపాడు గ్రామానికి చెందిన నలబ ఏసు బాబుకు వారం రోజుల కింద ఓ ప్రమాదం జరిగింది. అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు అల్లుడు చిరంజీవి ఏలూరుపాడు వచ్చాడు. ఈ సమయంలో 'మా నాన్నని హాస్పిటల్ తీసుకెళ్లడానికి నువ్వెవడు రా అంటూ' బావ చిరంజీవిని ఇనుపురాడుతో కొట్టడానికి నిందితుడు సత్యనారాయణ ప్రయత్నించాడు. అడ్డు వెళ్లిన తల్లి ఏసమ్మ చాతి మీద కొట్టి ఆ తర్వాత బావ చిరంజీవిని ఇనుపురాడుతో గాయపరిచాడు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన క్షతగాత్రులు అక్కడ చికిత్స పొందుతున్నారు. ఏసమ్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో వద్ద పేకాట ఆడుతున్న 11 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాళ్ల ఎస్సై మూర్తి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం స్పెషల్ బ్రాంచ్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కాళ్లపోలీసులు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఏలూరుపాడులో పేకాట స్థావరంపై దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ69,800 స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపై కూతురి దాడి

సాక్షి, భీమవరం: భీమవరం రెండో పట్టణం సత్యవతి నగర్‌కు చెందిన డి.సుభద్ర అనే మహిళపై ఆమె కుమార్తె పార్వతి కొట్టడంతో చేతికి తీవ్ర గాయమైందని ఎస్సై వి.రాంబాబు తెలిపారు. ఇంటి విషయమై ఘర్షణపడి కొట్టినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెరుకువాడలో అట్రాసిటీ కేసు నమోదు

ఉండి: మండలంఓలని చెరుకువాడలో మరో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు మండలం ఐ.భీమవరం గ్రామానికి చెందిన మద్దా జాన్‌మోషే అనే వ్యక్తి తనను భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన కలిదిండి రామచంద్రరాజు మరో ఐదుగురు కలిసి కులంపేరుతో ధూషించి కొట్టినట్లు ఫిర్యాదు చేయడంతో ఉండి ఎస్‌ఛార్జ్ ఎస్సై మూర్తి కేసు నమోదు చేశారు. చెరుకువాడ గ్రామంలోని కనుమూరి వెంకటసూర్యానారాయణరాజుకు చెందిన చెరువును లీజుకు తీసుకున్న రామచంద్రరాజు లీజు గడువు ముగిసినా చెరువును ఖాళీ చేయకపోవడంతో అడిగినందుకు తన యజమానిపైనా గొడవకు దిగడంతో పాటు తనను కులం పేరుతో ధూషించి కొట్టినట్లు బాధితుడి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మెడికల్ పీజీలో ప్రతిభ

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన డాక్టర్ గుడిమెట్ల అనూషారెడ్డి మెడికల్ పీజీలో ఆల్ ఇండియా స్థాయిలో 500వ ర్యాంకు సాధించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ఆశ్రం కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అనూషారెడ్డి ప్రస్తుతం పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 104లో మెడికల్ ఆఫీసర్‌గా పని చేసి, గ్రామీణ ప్రాంతాలలోని రోగులకు సేవలందిస్తున్నారు.